

# రాయినయం

ఒకప్పుడు మగధ దేశంలో కామందకుడనే రాజు ఉండేవాడు. ఆయన రాజ్యం చిన్నది. ఆయన చిన్నవాడు. కానీ, అతని స్వభావం ఎంత మాత్రం చిన్నది కాదు. దయ, దాక్షిణ్యం అనేవి అతనికి ఏ కోశానా లేవు. తను దైవాంశ సంభూతుడనని అతనికో గుడ్డినమ్మకం ఉండేది. ఆ కీటుకు కనిపెట్టి, అతన్ని ఆకాశాని కెత్తిన వారిని ఆ రాజు సన్మానించేవాడు. నిజం చెప్పిన వారిని సర్వనాశనం చేసేవాడు. అతను దుర్మార్గుడు కనుక అతని చుట్టూ దుర్మార్గులే చేరారు.

వీటన్నింటినీ మించి కామందకునికి ఓ కన్ను లేదు. ఆ లోపం కనిపించకుండా, అతను లొట్టకన్నుకు గాజుకన్ను అతికించుకొన్నాడు. ప్రారంభంలో రాజుగారికో కన్ను లేదన్న సంగతి ముఖ్యులైన రాజోద్యోగులకే తెలుసు. రాను రాను, ఈ సంగతి రాజ్యంలోని వారందరికీ తెలిసి పోయింది. కాని రాజుగారికున్న రెండు కన్నుల్లో, ఏ కన్ను మంచిదో, ఏది గాజుదో ఎవరికీ తెలీదు.

ఒక రోజున కామందకునికో ఆలోచన వచ్చింది. తన కోశాగారం ఖాళీగా లేకపోవచ్చుగాక, తగినంత నిండుగా కూడా లేదు. తన కున్న ఈ చిన్న లోపాన్ని ఆసరాగా తీసుకొని, తన కోశాన్ని ఎందుకు నింపుకో కూడదూ?

అందుకు ఓ ఉపాయం ఆలోచించి చాటింపు వేయించాడు. "తన కన్నుల్లో ఏది గాజు కన్నో చెప్పగల వారికి తన రాజ్యం అంతా ఇచ్చి వేస్తానని, చెప్పలేక పోయినవాడు తన ఆస్తిపాస్తుల్ని రాజుగారికి ఇచ్చి వేయాలని, ఇందుకు ఆమోదించినవారు వెంటనే రావచ్చునని—చాటింపు వినిన వెంటనే రాజ్యం మీద ఆశకొద్దీ, చాలా మంది ప్రయత్నించారు. చిత్తుగా ఓడిపోయారు. ఈ కిటుకుతో కామందకుని కోశం పూర్తిగా నిండిపోయింది.

ఓ సారి పదహారేళ్ళ కుర్రవాడొకడు కామందకుని దర్శనం చేసుకొని, ఏది గాజుకన్నో తను ఖచ్చితంగా చెబుతానన్నాడు. తనకు ఆస్తిపాస్తులు లేవనీ, తను గనుక ఓడిపోతే ఆస్తికి బదులుగా తన శిరస్సును ఇస్తాననీ అన్నాడతను.

కామందకుడు "సరే" నన్నాడు. ఆ కుర్రవాడు రెండు నిమిషాలు, రాజు కన్నుల్లోకి చూసి ''ఫలానా కన్ను గాజుకన్ను'' అని చెప్పాడు.

"నిజమే! నీకెలా తెలిసింది?'' అన్నారు రాజుగారు.

"అయ్యా! ఎదురుగా ఉన్న ఆ నిరుపేద కుటుంబాన్నీ, వారు పడుతున్న బాధలనూ చూసి మీ కుడికన్ను చెమర్చింది. అందుకని, అదే గాజుకన్ను అనుకొన్నాను" అన్నాడు కుర్రవాడు. కామందకుడు కొయ్యబారిపోయాడు.

—౦—